

రైల్వే షెల్టర్ లేకుండా పెయిడ్ పార్కింగ్

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ సిటీ రైల్వేస్టేషన్ వద్ద పార్కింగ్ షెల్టర్ లేకుండా పెయిడ్ పార్కింగ్ ఫీజు వసూలు చేయడం వినియోగదారుల రక్షణ చట్టం సేవలకు విరుద్ధమని పౌరసంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణ రాజు తెలిపారు. రైల్వే ప్రయాణికుల నుంచి దౌర్జన్యంగా పార్కింగ్ ఫీజ్ లాక్కుంటున్న తీరు తగదన్నారు. విషయం తెలియని ప్రజల నుంచి పార్కింగ్ ఫీజులు దండుకుంటున్నారన్నారు. దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఇటువంటి పోకడలను పట్టించుకోక పోవడం వల్ల పార్కింగ్ ఫీజుల దందా యథేచ్ఛగా మారిందన్నారు. పార్కింగ్ ఫీజు వసూలు చేయాలంటే వాహనాల పార్కింగ్ షెడ్లు ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజల సొమ్ములు దోపిడీ చేయడం కేంద్ర రైల్వే శాఖకు తగదన్నారు.

నిర్లక్ష్యం నీడన బస్ షెల్టర్లు

ఆక్రమణలకు నిలయంగా బస్ షెల్టర్లు

ప్రజాశక్తి - సామర్లకోట

దాతలు నిర్మించిన పలు బస్ షెల్టర్లు పట్టణం, మండలంలో నిరుపయోగంగా ఉన్నాయి. పేరుకు షెల్టర్లు ఉన్నా అవి నిర్వహణ లోపంతో ప్రజలు ఉపయోగించుకునేందుకు పనికి రావడం లేదు. కొన్ని షెల్టర్లు తుప్పలతో నిండుకోగా మరికొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇంకా కొన్ని షెల్టర్లు కొందరు వ్యాపారుల ఆక్రమణాల్లో మగ్గుతున్నాయి. ఇలా సామర్లకోట మండలంలో బస్ షెల్టర్ లు దర్శనమిస్తున్నాయి. సుమారు అన్ని షెల్టర్‌లూ దాతల సహకారంతోనే నిర్మించగా కొద్ది కాలంపాటు దాతల నిర్వహణలో బాగానే సేవలు అందిస్తూ వచ్చాయి. తదుపరి అవి నిర్లక్ష్యానికి గురయ్యాయి. పట్టణంలో స్థానిక బళ్ల మార్కెట్ సెంటర్లో ఉన్న షెల్టర్ ప్రయాణికులు ఉపయోగించు కునేందుకు వీలులేకుండా కొందరు చిరు వ్యాపారులు ఆక్రమించారు. షెల్టర్లో వ్యాపారాలకు సంబంధించిన సామాగ్రిని ఉంచడంతో పాటు షెల్టర్‌కు ఎదురుగా బడ్డీ ఏర్పాటు చేయడంతో అసలు అక్కడ బస్ షెల్టర్ ఉందనే విషయాన్ని ప్రజలు మరిచారు. పట్టణంలోని పెద్దాపురం రోడ్డులో ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న బస్ షెల్టర్‌ను ఏదో భారీ వాహనం ఢీ కొట్టడంతో పూర్తిగా కూలిపోయింది. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని ఎవరూ ఆపలేదు సరికదా షెల్టర్‌ను పునర్నిర్మించే చర్యలు చేపట్టలేదు. సుమారు



ప్రసన్నాంజనేయ ఆలయం వద్ద కూలిపోయిన షెల్టర్

సంవత్సరం కాలంగా శిథిలావస్థలో షెల్టర్ పడి ఉండటంతో నిరుపయోగంగానే ఉంది. ఇక మండలంలోని వికె. రాయపురం గ్రామంలో రెండు బస్ షెల్టర్లు ఉన్నాయి. కాకినాడ వెళ్లే ప్రయాణికులు వేచి ఉండేందుకు గ్రామానికి చెందిన ఒక రైతు నాయకుడు దానిని నిర్మించగా అది ప్రస్తుతం పొదలతో నిండుకుని ప్రమాధాకరంగా ఉంది. దాని నిర్వహణను ఎవరూ పట్టించుకోక పోవడంతో షెల్టర్ లోనికి విష సర్పాలు చేరుతుండటంతో అది ప్రయాణికులకు ఏమాత్రం ఉపయోగ పడటం లేదు. దానికి ఎదురుగానే సామర్లకోట వైపు వెళ్లే ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన షెల్టర్‌లో చెత్తా చెదారం ఉండ టంతో ప్రయాణికులు దానిలో నిలబడాలన్నా తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. షెల్టర్ వద్ద వర్షపు జలాలు నిలిచిపోయి బురదగా ఉండటంతో అదికూడా పూర్తి స్థాయిలో ప్రయానీకుల అవసరాలు తీర్చలేక పోతోంది. మాధవపట్నం, హుస్సేన్‌పురం, వేట్లపాలెం గ్రామాల్లోనూ బస్ షెల్టర్ల పరిస్థితి దయనీయంగా ఉంది. ఇంకా పలు గ్రామాల్లో, పట్టణంలో సైతం అనేక చోట్ల బస్ షెల్టర్‌లు గతంలో ఉండగా అవి ప్రస్తుతం కనుమరుగయ్యాయి. ఆక్రమణలకు లోనై అవి వ్యాపార కేంద్రాలుగా మారాయి. అయినా అధికారులెవరూ వాటిపై దృష్టి పెట్టకపోవడం విచారం. బస్ షెల్టర్ స్థలాలన్నీ ప్రభుత్వ స్థలాలే అయినందున మున్సిపాలిటీ, పంచాయితీల మాస్టర్ ప్లాన్‌లు పరిశీలిస్తే ఎక్కడెక్కడ షెల్టర్‌లు పూర్వీకులు కేటాయించారో గుర్తించే అవకాశలున్నాయి. కాగా ప్రధానంగా మహిళలు, విద్యార్థులు ఈ బస్ షెల్టర్లను ఉపయోగించు కుంటుండగా బాగా ఎండలు కాచినా, వర్షాలు కురిసినా తలదాచుకునే పరిస్థితి ఉండటం లేదని వాపోతున్నారు. దాతలు కట్టించిన బస్ షెల్టర్లకు మున్సిపల్ అధికారులు, పంచాయితీ సిబ్బంది చొరవ తీసుకుని నిర్వహణ భాధ్యతలు వహిస్తే ప్రయాణికులకు సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ ఆస్తులుగా ఉన్న స్థలాలను కాపాడుకోవచ్చు. సంభంధిత అధికారులు ఇప్పటికైనా ప్రభుత్వ బస్ షెల్టర్ స్థలాలను గుర్తించి ఆక్రమాణలు తొలగించి ప్రజల సేవలకు వినియోగంలోకి తీసుకు రావాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.



బళ్ల మార్కెట్ సెంటర్లో ఆక్రమణలకు గురవుతున్న షెల్టర్



సభలో ప్రసంగిస్తున్న చంద్రశేఖర రావు

అందరిపైనా మాతృభాష పరిరక్షణ బాధ్యత

ప్రజాశక్తి - పెద్దాపురం

మాతృభాషను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోస్యుల కృష్ణబాబు అన్నారు. ఆదివారం సాహిత్య, సాంస్కృతిక, కళా రంగాల వేదిక (కాకినాడ) ఆధ్వర్యంలో స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో దాడి చంద్రశేఖరరావు అధ్యక్షతన నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చని, తమ మాతృభాష ప్రాముఖ్యతను మాత్రం విస్మరించకూడదన్నారు. పలువురు తెలుగు పండితులు మాట్లాడుతూ మాతృభాషలోనే ప్రాథమిక విద్యా బోధన జరిగేలా అందరూ కృషి చేయాలన్నారు. మాతృభాషను విస్మరిస్తే, మాట్లాడడం, రాయడం మానివేస్తే మాతృభాష జ్ఞాన సంపద భవిష్యత్ తరాలకు అందకుండా పోతుందన్నారు. దాడి చంద్రశేఖర రావు మాట్లాడుతూ ప్రాచీన కవుల సాహిత్యం నుండి నేటి ఆధునిక కవుల సాహిత్య గొప్పతనాన్ని వివరించారు. ఈ సభలో విశ్రాంత అధ్యాపకులు బాలిన నూకరాజు, లూథరన్ హైస్కూల్ కరస్పాండెంట్ జి.నళిని తదితరులు ప్రసంగించారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన, క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం 20 మంది ఉత్తమ తెలుగు ఉపాధ్యాయులను దాడి చంద్రశేఖరరావు ఘనంగా సన్మానించారు.

హాకీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-కాకినాడ



హాకీ పోటీలను ప్రారంభిస్తున్న శ్రీనివాస కుమార్

హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టినరోజు సందర్భంగా ఏటా నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 23 నుంచి 31 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాస కుమార్ తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న హాకీ పోటీలను ఆదివారం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (సాప్) ఆదేశాల మేరకు ఈ నెల 23 నుంచి 31 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 25, ఆదివారం డిఎస్ఎలో పాఠశాల విద్యార్థులకు హాకీ పోటీలు నిర్వహిస్తామన్నారు. 26న జిల్లా క్రీడా మైదానంలో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ, ఫన్ గేమ్స్, ఉట్టి అడించడం, పిల్లలకు హాకీ టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు. 27న డిఎస్ఎ, కెవికెలో క్రీడలు ఇతర సరదా గేమ్‌ల నిర్వహణ, అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హాకీ, వాలీబాల్, కబడ్డీ, పవర్ లిఫ్టింగ్, యోగా బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, చెస్, టెన్నిస్, క్యారమ్స్, పురుషులు, మహిళలకు టగ్ ఆఫ్ వార్, రైఫిల్ షూటింగ్, ఆర్చరీ పోటీలు నిర్వహిస్తామన్నారు. 28న డిఎస్ఎలో 17 సంవత్సరాల వరకు ఉన్న బాలబాలికలకు పాఠశాల, ఇంటర్ కళాశాలల విద్యార్థులకు క్రీడా పోటీలు ఆటల నిర్వహిస్తామన్నారు. 29న వెయ్యి మంది క్రీడాకారులతో ఉదయం భానుగుడి నుంచి డిఎస్ఎ స్టేడియం వరకూ 3 కిలోమీటర్ల ర్యాలీ, 9 గంటలకు ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేయడం, అనంతరం అతిథులకు సత్కారం, క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానోత్సవం, 10 గంటల నుంచి 4 గంటల వరకు క్రీడలు నిర్వహిస్తామని తెలిపారు. 30న డిపార్ట్‌మెంట్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ సెమీ ఫైనల్స్, 31న డిపార్ట్‌మెంట్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఫైనల్స్, బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాకీ కోచ్ పీబీ.నాగేంద్ర కుమార్, జిల్లా పిఇటి అసోసియేషన్ అధ్యక్షులు వి.రవిరాజు, జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం టివిఎస్ రంగారావు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫీవర్ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఫీవర్ సర్వే సమర్థవంతంగా నిర్వహించాలని డిఎం అండ్ హెచ్ఓ జె.నరసింహ నాయక్ వైద్యాధికారులను ఆదేశించారు. పెద్దాపురం మండలం తిరుపతి, చదలాడ గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన డోర్ టు డోర్ ఫీవర్ సర్వేను పరిశీలించారు. ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే విషయంలో అశ్రద్ధగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. సిబ్బంది బృందాలుగా ఏర్పడి సర్వే నిర్వహించాలన్నారు. జ్వరం బాధితులను గుర్తించి సమీపంలోని ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ పి.సరిత, తహశీల్దారు సిహెచ్.వెంకటలక్ష్మి, డాక్టర్లు పాల్గొన్నారు.



గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్న డి ఎం అండ్ హెచ్

ఆకట్టుకున్న కోలాటం

ప్రజాశక్తి - సామర్లకోట

సుమారు ఆరు నెలలుగా శిక్షణ పొందిన చిన్నారులు, మహిళలు ఆదివారం సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామం విశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహించిన కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కోలాటం నేర్పించిన గురువు గుణ్ణం వీర్రాజును గ్రామ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అమలకంటి చంటి బాబు, కట్ట రాంబాబు, మోదమూను ప్రసాద్, జి.సత్తిబాబు, పలివెల చంద్రశేఖర్, సత్యనారాయణ, గుడాల గణేష్, చల్లా బుజ్జి, కోట అప్పారావు, చల్లా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐను అభినందిస్తున్న నాయకులు

కోరంగి ఎస్ఐకు అభినందన

ప్రజాశక్తి- తాళ్లరేవు

కోరంగి పోలీస్ స్టేషన్ ఎస్ఐ. పి. సత్యనారాయణను శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ నాయకులు ఆదివారం అభినందించారు. కోరంగి స్టేషన్‌కు బదిలీ పై వచ్చిన కొద్ది కాలంలోనే ఎస్ఐ. సత్యనారాయణ ప్రజాదరణ పొందారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డి శివాజీ, పితాని శ్రీను, మేడిశెట్టి వెంకటరమణ, మురమళ్ళ హైస్కూల్ ఎస్ఎంసి చైర్మన్ వివిఎస్.మూర్తి పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రుణాల పంపిణీ

మహారాష్ట్రలోని జెల్గాన్ నుంచి ఆదివారం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లఖ్-పతి దీదీ కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని నరేంద్రమోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలుచోట్ల ప్రజాప్రతినిధులు మహిళా సంఘాలకు రుణాలు పంపిణీ చేశారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

కాకినాడ ప్రధాని మోడీ వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్‌డిఎ పీడీ శ్రీరమణి, ఎల్‌డిఎండి ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా మాట్లాడుతూ అక్కచెల్లెమ్మలను లక్షాధికారులుగా చేయడంతో పాటు మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ఈ కార్యక్రమం చేపట్టారని చెప్పారు. ప్రత్యేకంగా వ్యవసాయ రంగంలో కూడా మహిళలు ఆదాయాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రభుత్వం అందించిన రూ.లక్ష రుణాన్ని ఉపయోగించుకుని జీవనోపాధి పెంచుకునేలా చూడాలన్నారు. భారీ, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడం లేదా మహిళలకు చేతనైన రంగంలో అభివద్ధి సాధించేందుకు ఉన్న అవకాశాలను ఉపయోగించుకునేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. ప్రతి మహిళనూ లక్షాధికారులుగా చేసే అవకాశం ప్రభుత్వం కల్పించిందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో 1,041 స్వయం సహాయక సంఘాల్లో సభ్యులైన లఖ్-పతి దీదీలకు రూ.109.55 కోట్ల బ్యాంకు రుణాల పంపిణీ చేసినట్టు తెలిపారు. లఖ్-పతిదీదీ అంటే రూ.లక్ష లేదా అంతకంటే ఎక్కువ వార్షిక కుటుంబ ఆదాయాన్ని ఆర్జించే ఒక స్వయం-సహాయక సంఘం సభ్యురాలని, ఈ ఆదాయం సగటు నెలవారీ ఆదాయం పదివేలు మించి ఉండేటట్టు తద్వారా ఇది స్థిరంగా ఉంటూ, కనీసం నాలుగు వ్యవసాయ రుతువులు లేదా వ్యాపారాలకు వర్తిస్తుందన్నారు. మహిళలు తమ ఆదాయం కోసం మాత్రమే కాక స్థిరమైన జీవనోపాధి పద్ధతులను (వ్యవసాయం లేదా వ్యవసాయేతర లేదా సేవల రంగం), వనరులను సమర్థవంతంగా నిర్వహించడం మంచి జీవన ప్రమాణాన్ని మెరుగుపరుచుకోవడం కోసం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాకు 61,697 లఖ్ - పతి దీదీల లక్ష్యం కేటాయించగా ఇప్పటివరకు 72,681 లఖ్ - పతి దీదీలను గుర్తించి 100 శాతం పైనే లక్ష్యాన్ని చేరుకున్నట్టు తెలిపారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా కేటాయించిన లక్ష్యాన్ని సాధించినట్టు తెలిపారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి సామాజిక పెట్టుబడి నిధి ద్వారా లఖ్ - పతి దీదీలకు ఆర్థిక సహాయం అందించి స్థిరమైన జీవనోపాధి కల్పించి లఖ్ - పతి దీదీ కావడానికి చర్యలు చేపట్టినట్టు ఆయన తెలిపారు. పండ్లతోటల పెంపకం, చేపల పెంపకం, పశుసంవర్ధక శాఖ, వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ, నాబార్డు, పరిశ్రమల శాఖ, తదితర శాఖలు సమన్వయం చేసుకొని లఖ్ - పతి దీదీలకు ఆర్థిక సాయం చేసి మెరుగ్గైన జీవనోపాధి కల్పించి నిర్దేశించిన లఖ్ - పతి దీదీలకు లక్షాధికారులను చేయడం జరుగుతుందన్నారు. కాకినాడ జిల్లాలో 1041 స్వయం సహాయక సంఘాల లఖ్ - పతి దీదీలకు రూ.109.55 కోట్ల బ్యాంకు రుణాలకు సంబంధించి ఆదర్శ మండలాలుగా ఎంపికైన కరప, కాజులూరు, పిఠాపురం మండలాల స్వయం సహాయక సంఘాలకు మెగా చెక్‌ను జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డిఆర్‌డిఎ పీడీ లబ్ధిదారులకు అందజేశారు.

తాళ్లరేవు ఎంపిపి రాయుడు సునీత సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామ సంఘం నుంచి 70 మందిని ఎంపిక చేసి ఈ పథకాన్ని అమలు చేయనున్నట్టు ఎపిఎం సన్యాసిరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఒఎల సంఘం అధ్యక్షులు కె.ఈశ్వరీభాయి, రాయుడు గంగాధర్, నడింపల్లి వినోద్, ధూళిపూడి బాబీ పాల్గొన్నారు.

పెద్దాపురం సమాజంలో సగం మంది గా ఉన్న మహిళలు అభివద్ధి సాధించినప్పుడే మహిళా అభ్యుదయం సాధ్యమవుతుందని ఎంఎల్ఎ మ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఎపిఎం సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. 118 డ్వాక్రా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరైన రూ.8.50 కోట్లు చెక్కును మహిళా సంఘాల సభ్యులకు ఎంఎల్ఎ చినరాజప్ప అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, తూతిక రాజు, దేవళ్ల సతీష్, ఆదినారాయణమూర్తి, మండల మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు అమ్ములు, మంగతాయారు, సిసిలు తవుడు శ్రీనివాస్, దుర్గ పాల్గొన్నారు.

ఏలేశ్వరం ఎంపిపి గొల్లపల్లి బుజ్జి మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళలకు రూ.3.8 కోట్ల బ్యాంకు లింకేజీ చెక్కును ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కొప్పుల బాబ్జి, మాజీ జెడ్‌పిటిసి జ్యోతుల పెదబాబు, టిడిపి నాయకులు చిక్కాల లక్ష్మణరావు, ఎస్‌జివి.సుబ్బరాజు, సూతి బూరయ్య, పెంటకోట శ్రీధర్, నూకతాటి ఈశ్వరుడు, ఎపిఎం కె.సూర్య ప్రసాద్ పాల్గొన్నారు.

సామర్లకోట మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ఎపిఎం ప్రశాంతి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి జూమ్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు లింకేజీ ద్వారా మండల పరిధిలో 34 మహిళా సమాఖ్యలకు రూ.4.45 కోట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్ష కార్యదర్శులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్ (చిన్ని), భీమేశ్వరాలయం మాజీ ట్రస్ట్ చైర్మన్ కంటే జగదీష్ మోహన్ (బాబు), కౌన్సిలర్ బలుసు వాసు, నిమ్మకాయల కిరణ్, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు శ్రీనుబాబు, విష్ణుమూర్తి, రత్నం, శాంతి కుమారి, మండల సమాఖ్య అకౌంటెంట్ శ్యామ్ సుధాకర్, మండల సమాఖ్య ప్రతినిధులు ఎం.నాంచారమ్మ, లోవకుమారి పాల్గొన్నారు.



పెద్దాపురంలో మహిళా సంఘాలకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప




తాళ్లరేవులో సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి రాయుడు సునీత



కాకినాడలో మెగా చెక్కును అందజేస్తున్న జెసి రాహుల్ మీనా

కార్టూ'నిజం'



శ్రీ ప్రకాష్‌లో జోనల్ స్థాయి స్విమ్మింగ్ పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రామారావుపేటలోని శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లో జోనల్ స్థాయి శ్రీ ప్రకాష్ స్విమ్మింగ్ ఛాంపియన్స్ ట్రోఫీ-2024 పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, బాలురు, బాలికలకు నాలుగు గ్రూపుల్లో ఈ పోటీలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం జరిగిన ముగింపు సభలో మాజీ మున్సిపల్ చైర్మన్, ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు రాజా సూరిబాబు రాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీర ఆరోగ్యం పెంపొందించడంలో ఈత ప్రముఖ పాత్ర వహిస్తుందన్నారు. తమని తాము రక్షించుకునేందుకే కాక ఈత నేర్చుకోవడం వల్ల ఇతరులను కూడా రక్షించవచ్చున్నారు. మరో అతిథి సాఫ్ట్వేర్ ఇంజనీర్ మాసిన రామ్ ప్రకాష్ మాట్లాడుతూ తాను అమెరికాలోని అనేక పాఠశాలలు చూశానని, శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు చూసిన తనకు పిల్లల్ని ఇక్కడ చేర్పించాలనిపిస్తోందని చెప్పారు. స్కూల్ డైరెక్టర్ సిహెచ్.విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ క్రీడల పట్ల తల్లిదండ్రులలో కూడా అవగాహన పెరిగిందని, తమ పిల్లల్ని వివిధ క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారన్నారు. ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుండి సుమారు 100 మంది బాల బాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. అనంతరం విజేతలకు స్కూల్ డైరెక్టర్ విజయ్ ప్రకాష్ ట్రోఫీలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గోవిందరాజు, పి.రాజు, అకడమిక్ కో-ఆర్డినేటర్ నాగ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



స్విమ్మింగ్ పోటీల్లో గెలుపొందిన విజేతలు

రెండు మున్సిపాలిటీల అభివృద్ధిపై దృష్టి

పెద్దాపురం ఎంఎల్ఎ చినరాజప్ప

ప్రజాశక్తి - సామర్లకోట

గత వైసిపి ప్రభుత్వం సామర్లకోట పెద్దాపురం మున్సిపాలిటీలో నిర్లక్ష్యం చేసిన అభివద్ధి పనులను సత్వరమే చేసి రెండు పట్టణాలు ఆదర్శ పట్టణాలుగా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సహాయంతో కృషి చేస్తానని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప చెప్పారు. ఆదివారం సామర్లకోట రైల్వే స్టేషన్ సెంటర్‌లో ఉన్న గడియారం స్తంభం నిర్మాణం పనులు ఆగిపోగా వాటిని పున్ణప్రారంభించే నిమిత్తం చేపట్టే చర్యలను మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, నాయకులతో కలిసి పరిశీలించారు. ఆగిపోయిన స్థానిక నీలమ్మ చెరువు అభివద్ధి పనులను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చినరాజప్ప మాట్లాడుతూ అభివద్ధి పనులు త్వరితగతిన చేయని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్టులో పెడతామని, అవసరమైతే వారి పేర్లు లిస్ట్ నుండి తొలగిస్తామని హెచ్చరించారు. సామర్లకోట, పెద్దాపురం పట్టణాల్లో అభివద్ధి పనులను టిడిపి చేపట్టిందన్న కక్షతో పూర్తి కాకుండా వైసిపి ప్రభుత్వం అడ్డగించిందన్నారు. సామర్లకోటలో గడియార స్తంభం పడగొట్టడానికి ప్రయత్నించగా తాను అడ్డుకున్నట్లు చెప్పారు. రెండు పట్టణాల్లో రూ.70 లక్షలతో మున్సిపల్ డ్రెయిన్‌ల అభివద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తెచ్చి నియోజకవర్గ పరిధిలోని రాజానగరం పెద్దాపురం ఆర్ అండ్ బి రోడ్డు పూర్తిస్థాయిలో అభివద్ధి చేసేలా చర్యలు చేపడతామన్నారు. గడియార స్తంభం నేలమ్మ చెరువు అభివద్ధి పనులకు నిధులు కేటాయించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్ష కార్యదర్శులు అడబాల కుమారస్వామి బడుగు శ్రీకాంత్ కౌన్సిలర్ బలుసు వాసు, దినేష్, ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ కంటే జగదీష్ మోహన్ మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య, సాగర్, మాజీ కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.



పనులపై సూచనలు ఇస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

నేరాలు ఘోరాలు

పేకాడుతున్న నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలం నీలపల్లి పరిధిలో పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు. స్థానిక చేపల మార్కెట్ సమీపంలో వీరు పేకాడుతుండగా అరెస్టు చేసి, వీరి వద్ద నుంచి రూ.4500 స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించినట్టు ఆయన తెలిపారు.

మరిడమ్మ ఆలయంలో వెండి ఆభరణం చోరీ

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం స్థానిక రైల్వే స్టేషన్ రహదారిలో ఉన్న మరిడమ్మ తల్లి ఆలయంలో వెండి ఆభరణం చోరీకి గురైనట్టు అన్నవరం పోలీసులకి ఆలయ నిర్వాహకులు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి శనివారం మధ్యాహ్నం సుమారు రెండు గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు అమ్మవారిని దర్శించుకునే వంకతో ఆలయంలో ప్రవేశించి అమ్మవారి కాలికి ఉన్న లక్ష విలువ గల వెండి పాదాన్ని అపహరించుకు పోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆలయంలో ఉన్న సిసి కెమేరా పనిచెయ్యకపోవడం గమనార్హం.



మృతదేహం వద్ద రోధిస్తున్న తల్లిదండ్రులు

ఆర్‌టిసి బస్సు ఢీకొని యువకుడు మరణం

ప్రజాశక్తి - తాళ్లరేవు

గాడిమొగ గ్రామానికి చెందిన మల్లాడి గంగాధర్ (26) ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తాళ్ళరేవు నుంచి యానాం వైపు బైకుపై వెళ్తున్న గంగాధర్‌ను అమలాపురం నుంచి కాకినాడ వైపు వెళ్తున్న ఆర్‌టిసి బస్సు ఎదురుగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. చేతికి అంది వచ్చిన కొడుకు అనుకోని ప్రమాదంలో అసువులు బాయడంతో అతని తండ్రి మల్లాడి రాఘవ కొడుకు మతదేహంపై పడి గుండెలవిసేలా రోదించాడు. రాఘవకు నలుగురు కుమారులు కాగా గంగాధర్ మూడో కుమారుడు. ఇటీవల తాళ్ళరేవు బైపాస్‌లో వ్యాపార దుకాణం ప్రారంభించారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

మండలంలోని గ్రామాల పరివాహక లంక ప్రాంతాలలో ఆదివారం ఎస్సై ఎస్ శ్రీనివాస్ నాటు సారా తయారీ స్థావరాలపై తన సిబ్బందితో విస్తత దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బొబ్బర్లంక గ్రామ శివారు లంకలో నాటు సారా తయారు చేయడానికి ఉంచిన180 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మహిళ అదృశ్యమైన ఘటనపై అంగర పోలీసులు కేసు నమోదు చేశారు. కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన అంసూరి సత్యవతి (66) సం?లు ఈ నెల 16 నుంచి కనిపించడం లేదంటూ ఆమె మనవడు అంసూరి శ్రీనివాస్ ఈనెల 18న అంగర పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై 19న కేసు నమోదు చేశారు . బైయటకువెళ్లిన సత్యవతి ఇంటికి తిరిగి రాలేదంటూ శ్రీనివాస్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో పెయింటర్ మృతి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

విద్యుత్ షాక్ కు గురై ఆదివారం ఒక వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని తానేల్లంక పంచాయతీ పరిధిలోని రజక పేటకు చెందిన పల్లపు గంగరాజు(35) పెయింటింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గంగరాజు ఒక పెయింటర్ వద్ద పనిచేస్తున్నాడు. కొత్తపేట మండలం మోడేకుర్రు గ్రామంలో వినాయకుడి గుడికి రంగులు వేస్తుండగా గంగరాజుకు విద్యుత్ తీగ తగలడంతో షాక్ గురై అక్కడికక్కడే మతి చెందాడు. రంగరాజుకు భార్య లక్ష్మి, కుమారుడు వీర నాగ కార్తికేయ, కుమార్తె ధరణి మహిత ఉన్నారు. ఆ కుటుంబానికి అతడే ఆధారం. యజమాని ఆకస్మికంగా మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామంలో అందరితో ఎంతో కలివిడిగా ఉండే రంగరాజు ఆకస్మికంగా మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కోడి పందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని అద్దంకివారి లంకలో కోడి పందేల శిబిరంపై అంగర పోలీసులు ఆదివారం దాడి చేశారు. అంగర ఎస్ఐ అందే పరదేశి తెలిపిన వివరాల ప్రకారం అద్దంకి వారి లంక గ్రామ శివారులో కోడిపందేలు ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడి చేశామన్నారు. పందేలు ఆడుతున్న అయిదుగురు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రెండు పందెం కోళ్ళు , రెండు మోటార్ బైకులు, రూ.8,020 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు .

యుటిఎఫ్ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావుకు పరామర్శ

ప్రజాశక్తి-ఆలమూరు

మండల యుటిఎఫ్ అధ్యక్షులు అద్దరి శ్రీనివాసరావు తండ్రి అద్దరి వీర్రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో శ్రీనివాస్‌ను యుటిఎఫ్ మండల శాఖ నాయకులు ఆదివారం పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ మండల యూనియన్ నాయకులు కెవిఆర్.బాపూజీ, వైవివి.రమణ, మూర్తి, మనోజ్‌కుమార్, లోకేష్, శ్రీనివాసరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్ఐవిపై అవగాహనా కార్యక్రమాలు

లెప్రసీ, ఎయిడ్స్ అధికారి డాక్టర్ వసుంధర





ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు, మార్గదర్శకాలతో జిల్లాలో యువతలో హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో యూత్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఆగస్టు 29న నిర్వహించనున్నారు. తూర్పు గోదావరి జిల్లా లేప్రసీ, ఎయిడ్స్ మరియు టిబి అధికారి డాక్టర్ ఎన్.వసుంధరను ప్రజాశక్తి పలుకరించగా పలు విషయాలను పంచుకున్నారు.

హెచ్ఐవిపై అవగాహన కల్పించేందుకే...

హెచ్ఐవి, ఎయిడ్స్ అవగాహనా కార్యాక్రమాలు చేపడుతున్నాం. హెచ్ఐవి నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండటం అవసరం. ప్రభుత్వం కూడా దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. కళాజాతాలు, పోస్టర్ల ప్రదర్శన, ర్యాలీలు, సమావేశాలు ఇలా పలు విధాలుగా హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలను రూపొందించాం. వీటిని తుచ తప్పకుండా అమలు చేసేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నాం.

అవగాహనలో భాగంగానే యూత్ ఫెస్టివల్

ఆగస్ట్ 29న నిర్వహించే యూత్ ఫెస్టివల్ కార్యక్రమంలో భాగంగా డిగ్రీ చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు, ట్రాన్సజెండర్లతో ఆగస్టు 29వ తేదిన 5కె రన్ నిర్వహిస్తున్నాం. ఐదు కిలో మీటర్ల మారథాన్ కార్యక్రమాన్ని ఉదయం 6.30 లకు రాజమహేంద్రవరంలోని వై.జంక్షన్ నుంచి గోదావరి నదీ తీరాన ఉన్న ఇస్కాన్ టెంపుల్ వరకు వయా నందం గనిరాజు జంక్షన్, కంబాల చెరువు, దేవి చౌక్, గోకవరం బస్టాండ్, మున్సిపల్ పార్క్, పుష్కర ఘాట్, గోదావరి బండ్ వరకూ నిర్వహిస్తున్నాము.

విజేతలకు బహుమతులు

విజేతలకు జిల్లా కలెక్టరు చేతుల మీదుగా బహుమతులు అందిస్తాం. ప్రథమ బహుమతి రూ.5,700, ద్వితీయ రూ.4వేలు, బాలురు, బాలికలు, ట్రాన్స్ జెండర్స్ విభాగాల్లో అందిస్తాం. అదే విధంగా 8వ, 9వ మరియు 10వ తరగతి చదువుతున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 29వ తేది ఆగస్టు 2024న మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా లెప్రసి, ఎయిడ్స్ మరియు టీబీ శాఖాధికారి వారి కార్యాలయంలో జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తాం. విజేతలకి ప్రథమ బహుమతిగా రూ.7 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.4 వేలు అందిస్తాం. ఆసక్తి ఉన్న విద్యార్థులు 9581531960, 9949495022 ఫోన్ నెంబర్లను సంప్రదించాలి.



అవార్డు అందుకుంటున్న యానిమేటర్ పద్మ

కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు

ప్రజాశక్తి-గండేపల్లి

విధి నిర్వహణలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఎపిఎం సన్యాసిరావు అన్నారు. లఖ్-పతి దీదీ కార్యక్రమం ద్వారా సర్వే పూర్తిస్థాయిలో చేయడం వల్ల గండేపల్లి మండలానికి యానిమేటర్ వల్లూరి పద్మకి అవార్డు అందడం అభినందనంగా ఉందన్నారు, జిల్లా జాయింట్ కలెక్టర్, డ్వామా పీడీ ద్వారా ఆమె ప్రశంసా పత్రం అందుకున్నట్టు తెలిపారు. ఆమెకు ఈ అవార్డు రావడం పట్ల వెలుగు కార్యాలయం, ఎపిఎం సన్యాసిరావు, సిబ్బంది మండల నాయకులు అభినందనలు తెలిపారు.

ప్రజలకు జవాబుదారీతనంగా పోలీసులు

ప్రజాశక్తి-కాకినాడ

పోలీసులు ప్రజలకు జవాబుదారీతనంగా పని చేయాలని, రాజకీయ ఒత్తిడిలకు భయపడకుండా పని చేయడమే పోలీస్ శాఖ పని అని కాకినాడ డిఎస్‌పి రఘువీర్ విష్ణు అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను గతంలో చిత్తూరు డిఎస్‌పిగా విజయనగరం ఎసిబి డిఎస్‌పిగా పని చేసి బదిలీపై కాకినాడ వచ్చినట్టు తెలిపారు. ప్రజల శాంతి భద్రతల విషయంలో రాజీ లేని పోరాటం చేస్తానని, ఎటువంటి రాజకీయ ఒత్తిడిలకు భయపడి పని చేసే సమస్య లేదన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చిన నేరుగా స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని తమకు న్యాయం జరగలేని పక్షంలో కాకినాడ డిఎస్‌పి కార్యాలయంలో సంప్రదిస్తే వెంటనే సమస్యను పరిష్కరిస్తామన్నారు. కాకినాడ రూరల్ సిఐ చైతన్య కృష్ణ, రెండవ పట్టణ, ఒకటో పట్టణ సిఐలు, ఎస్ఐలు, ఎఎస్ఐలు, పోలీసు సిబ్బంది డిఎస్‌పిని మర్యాదపూర్వక కలిసారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి రఘువీర్ విష్ణు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పలువురికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - పెద్దాపురం

తాటిపర్తిలో ఆదివారం గుమ్మలూరి శ్రీనివాసరావు, సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కొమ్మిరెడ్డి బుజ్జి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదలందరికీ అన్ని రకాల వైద్య సేవలూ అందించేందుకు దాతలు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది వైద్య సేవలందించారు. సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కళ్లజోళ్లు అవసరమైన వారిని, ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించారు. ఈ కార్యక్రమంలో రామిశెట్టి శ్రీను, ఎగ్గాడ సత్తిబాబు, ద్వారంపూడి చెల్లారావు, కొమ్మిరెడ్డి నాగ సుబ్రహ్మణ్యం, వేపకాయల తిరుపతిరావు, గోపు చంటిబాబు, కొమ్మిరెడ్డి చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ

సేవా నిరతిని చాటిన శివన్నారాయణ

ప్రజాశక్తి - తాళ్లరేవు

గ్రామీణ ప్రజలకు అందుబాటులో సేవా దక్పథంతో అన్ని హంగులతో కళ్యాణమండపం నిర్మించి శివన్నారాయణ తన సేవా నిరతిని మరొకసారి చాటుకున్నారని మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. పి.మల్లవరం పంచాయతీ పత్తిగొందిలో ఎఎంసి చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ నిర్మించిన కెవిఎస్ కన్వెన్షన్ కళ్యాణ మండపాన్ని మంత్రి ఆదివారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో పటవల మాజీ సర్పంచ్ కాలా సూరిబాబు, కూటమి నాయకులు బొంతు శ్రీనివాస్, దున్న మురళి, దున్న ఎల్లారావు, మేడిశెట్టి శ్రీను, సూరంపూడి శ్రీను, హరిబాబు, మట్టపర్తి శ్రీను పాల్గొన్నారు.

అవార్డులు ఇస్తామని అవమానించారు

ప్రజాశక్తి-కాకినాడ

బాగా పనిచేసే వారికి ప్రోత్సహించేదిగా కేంద్రం లఖ్-పతి దీదీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కలెక్టరేట్ వద్ద కార్యక్రమానికి తమను రమ్మని అవమానించారని యానిమేటర్ల సంఘం జిల్లా ప్రెసిడెంట్ కంద భవాని ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ రూరల్ మండలంలో విఒఎలు వ్యాపారవేత్తలను రమ్మని ఆఖరి వరకు ఉంచి అవార్డు ఇస్తామని చెప్పి అధికారులు తప్పుకున్నారని తెలిపారు. తమను ఎందుకు రమ్మన్నారు ఎందుకు పొమ్మన్నారని ఆమె ప్రశ్నించారు. గత సంవత్సరం మహిళా దినోత్సవం రోజున సామర్లకోటలో అవార్డులు ఇస్తామని చెప్పి ఇలాగే అవమానించారని తెలిపారు. తమకు ఘోర అవమానం జరిగిందని దీనికి బాధ్యులు ఎవరో తేల్చేవరకూ కాకినాడ రూరల్ మండల మహిళా సమాఖ్య ముందు నిరసన దీక్ష చేపడతామని హెచ్చరించారు.



సమావేశానికి వెళ్లిన మండల నాయకులు

నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణం

- మంజూరు కాని నిధులు
- పూర్తిచేయాలని కోరుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి-కోటనందూరు

కోటనందూరు మండలంలో ప్రభుత్వ విద్యాలయాల అదనపు గదులు నిర్మాణ పనులు నిధులు కొరతతో నిలిచిపోయాయి. కోటనందూరు మండలంలో మండలంలో 17 గ్రామపంచాయతీలో ఏడు జిల్లా పరిషత్ హై స్కూల్ ఉన్నాయి. అల్లిపూడి, కేఈ చిన్నయపాలెం, బొద్దవరం, హై స్కూల్ అభివృద్ధి కొరకు గత ప్రభుత్వంలో నాడు- నేడు పథకం ద్వారా ప్రభుత్వ విద్యాలయాల అభివద్ధి కొరకు నిధులు కేటాయించారు. అల్లిపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో అదనపు తరగతుల అయిదు గదులు నిర్మాణానికి రూ.50.99 లక్షలు కేటాయించగా వీటిలో రూ.41.19 లక్షల ఖర్చు చేశారు. ఓపెన్ శ్లాబ్ వేసి వదిలేశారు. ప్రహరీ నిర్మాణము చేపట్టలేదు. నిధుల కొరతతో మధ్యలోనే పనులు నిలిపివేయడం జరిగింది. బొద్దవరం గ్రామం హైస్కూల్లో లో అదనపు తరగతి నాలుగు గదిలో నిర్మాణానికి తొమ్మిదవ కాన్ఫరెన్స్ నిధులు రూ.88 లక్షలు మంజూరు చేసి వీటిలో రూ.36 లక్ష లు నిధులు ఖర్చు చేసి కొంతమేర నిర్మాణ పనులు చేసి మధ్యలోనే వదిలేశారు. కెఇ.చిన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో తొమ్మిదవ కాన్ఫిడెన్స్ నిధుల ద్వారా కోటి రూపాయలు నిధులు మంజూరు చేశారు. రూ.45 లక్షల నిధులు ఖర్చు చేసి కొన్ని పనులు పూర్తి చేశారు. హైస్కూల్ ప్రహరీ కూడా అసంపూర్తిగా నిర్మించారు. నిధులు పూర్తిగా మంజూరు చేయకపోవడం వల్ల నిర్మాణ పనుల మధ్యలోనే నిలిచిపోయాయని మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఏడాది విద్యా సంవత్సరంలో స్కూళ్లు ప్రారంభించి నెలలు గడుస్తున్నాయని అన్నారు. మధ్యలో నిలిచిపోయిన నిర్మాణ పనులను పున్ణ ప్రారంభించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రహరీ కూడా నిర్మాణం చేపట్టకపోవడం వల్ల విద్యాలయాల్లో రాత్రి సమయాల్లో అసంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నూతనంగా ఏర్పడిన విద్యాసంస్థల అభివృద్ధి చైర్మన్లు, కమిటీ సభ్యులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులను పూర్తి చేయాలని, విద్యార్థులు ,విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.



అల్లిపూడి జిల్లా పరిషత్ హై స్కూల్లో నిర్మాణంలో ఉన్న స్కూల్ భవనం

సమావేశానికి తరలిన నాయకులు

ప్రజాశక్తి -కరప

ఎస్‌సి వర్గీకణపై సుప్రీంకోర్టు తీర్పునకు నిరసనగా విజయవాడలో నిర్వహించిన సమావేశానికి పలువురు అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, మాల మహానాడు నాయకులు తరలివెళ్లారు. సుప్రీంకోర్టు న్యాయవాదులు మిశ్రా, సత్య ప్రకాష్, గౌతం ఆధ్వర్యంలో జెఎసి సమావేశం నిర్వహించారని. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన వర్గీకరణపై ఏ విధమైన కార్యచరణ చేయాలో జాతీయ స్థాయి నాయకులు నిర్ణయాలు తీసుకున్నట్టు సవిలే రాజేష్, మాతా అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మారెళ్ల వెంకటరమణ, చిన్న వెంకటేశ్వరరావు, ఫైట్ ఫర్ రైట్ ఫోరం అధ్యక్షుడు బుల్లి రాజు, కరప గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి లోహిదాస్, వజ్రపు కామేశ్వరరావు, గుబ్బల రామకృష్ణ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ నిరసన

ప్రజాశక్తి-ఏలేశ్వర

రాష్ట్రంలో వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే విధానాన్ని ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని సిపిఐ (ఎంఎల్, వినోద్ మిశ్రా) రాష్ట్ర కార్యదర్శి కొసిరెడ్డి గణేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఆ పార్టీ కార్యాలయంలో స్మార్ట్ మీటర్లపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిందన్నారు. అధికారంలోకి వచ్చాక కేంద్ర ఆదేశాలకు లొంగి రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు, గహ అవసరాలకు కూడా విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసేందుకు సన్నద్ధం అయిందని ఆరోపించారు. అదానీ కంపెనీకి వేల కోట్లు ముట్ట చెప్పేందుకే స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ప్రక్రియ తెరపైకి తెచ్చింది అన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే పెద్ద ఎత్తున ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కందుల క్రాంతి కుమార్ మహిళా సంఘం నాయకులు గండేటి నాగమణి, గుమ్మడి పాదాలమ్మ, గూనాపు వరలక్ష్మి, చందక దేవి, లోపింటి వరలక్ష్మి, చాచేపల్లి సీత తదితరులున్నారు.

ఆక్రమణల చెరలో ములికిపల్లి సెంటర్

- ఇబ్బందిపడుతున్న స్థానికులు, వాహనదారులు
- వెంటనే తొలగించాలని వేడుకోలు

ప్రజాశక్తి- రాజోలు

మండలంలోని ములికిపల్లి సెంటర్ లో ఆర్అండ్‌బి రహదారిపై అక్రమంగా ఏర్పాటు చేస్తున్నా. మూడు అంతస్థుల భవన నిర్మాణంపై యంత్రాంగం పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు,ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవన నిర్మాణంలో గ్రౌండ్ లెవిల్ లో వ్యాపార దుఖాణాలు ఉండటంతో కనిసం పార్కింగ్ స్థలం లేకుండా, నిబంధనలకు వ్యతిరేఖంగా భవన నిర్మాణం జరుగుతోంది. ఇది పూర్తిగా ట్రాఫిక్ కు అడ్డుగా ఉంది. సెంటర్ లో రహదారిని ఆనుకుని నూతన కట్టడాలు కొనసాగిస్తున్నారు. దీనిపై ఆర్అండ్బి అధికారులు, పంచాచతీ సిబ్బంది పట్టించుకోవడంలేదు. దశాబ్దాలుగా ములికిపల్లి సెంటర్ నుండి కడలి రోడ్డు మార్జిన్లో కొందరు చిన్న చిన్న వ్యాపార షాపులు ఏర్పాటు చేసుకోవటంతో పాటు తమ సామగ్రిని రోడ్డుపై వేయడంతో ఈ ప్రధాన రహదారిలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. దీంతో తరచూప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



ములికిపల్లి సెంటర్ లో రోడ్డుకు ఆనుకుని నిర్మించిన కట్టడం

ప్రమాదకరంగా ప్రధాన రహదారులు

- వెదురుమూడి మలుపు వద్ద ప్రమాదకరంగా గోతులతో ఏర్పడిన రహదారి
- ఎర్ర పోతవరం వద్ద కాలువ వైపు కుంగిన ద్రాక్షారామ-యానాం మెయిన్ రోడ్డు



వెదురుమూడి మలుపు వద్ద ప్రమాదకరంగా గోతులు

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల ప్రధాన రహదారులు ప్రమాదకరంగా ఉన్నాయి.దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధాన రహదారులు శిథిలావస్థకు చేరుకోవడం, పెద్ద గోతులు పడటంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. రహదారులపై ఉన్న గోతుల్లో ద్విచక్ర వాహనదారులు పడి గాయాల పాలవుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కపిలేశ్వరపురం: కపిలేశ్వరపురం మండల పరిధి వెదురుమూడి నుండి జొన్నాడ వెళ్లాలంటే ఆర్ అండ్ బి రహదారి గోతులతో ప్రమాద భరితంగా మారింది. ఈ రహదారి పై ప్రయాణాలు చేయాలంటే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతి రోజు రద్దీగా ఉండే ఈ రహదారి మీదుగా పాఠశాలకు వెళ్లే వాహనాలు ద్విచక్ర వాహనదారులు వెళ్లాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు వాహనదారులు ఆందోళన చెందుతున్నారు రహదారి లో మలుపు ఉండడం ఆ మలుపు సమీపంలో పెద్ద గోతులు ఏర్పడడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని ప్రజలు, స్థానికులు వాపోతున్నారు. ఈ రహదారి మీదుగా వెళ్లాలంటే విద్యార్థులు, వాహనదారులు గోతుల కారణంగా ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్డు మీదుగా కొత్తూరు, జొన్నాడ, రావులపాలెం, మండపేట తదితర గ్రామాల ప్రజలు ప్రతి నిత్యం రాకపోకలు సాగిస్తూ ఉంటారు . ఎంతో రద్దీగా ఉంటున్న రహదారిపై ప్రయాణాలు సాగిస్తున్న వాహనదారులకు ఎటువంటి ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు గోతులు ఏర్పడిన ప్రదేశాల్లో మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు, వాహన దారులు ప్రయాణికులు, ప్రజలు స్థానికులు కోరుతున్నారు.

రామచంద్రపురం: ద్రాక్షారామం నుంచి యానాం వెళ్లే మెయిన్ రోడ్ ప్రమాద భరితంగా తయారైంది. గత పదిహేడుగా అభివృద్ధి కోసం ఈ మెయిన్ రోడ్డు ఎర్ర పోతవరం నుంచి కోలంక వరకు మరింత దారుణంగా శిథిలమైంది. ఎర్ర పోతవరం నుంచి పంట కాలవై రోడ్డు కాలువ వైపు పగిలి పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మెయిన్ రోడ్డు కాలువైపు కంగి పోవడంతో పగులు ఏర్పడి రాత్రి సమయంలో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్ అండ్ బి అధికారులు ఇక్కడ ఒక ఎర్రజెండా ఏర్పాటుచేసి చేతులు దులుపుకున్నారు. చీకట్లో ఈ రహదారిపై ఉన్న ఈ పగులు కుంగిపోయిన ప్రాంతంలో ప్రమాదాలు జరిగి పలువురు ప్రయాణికులు ఆసుపత్రుల పాలవుతున్నారు. సుమారు 18 కిలోమీటర్లు పొడవైన ఈ మెయిన్ రోడ్డు వెంబడి ద్రాక్షారామ, వేగాయమ్మపేట, రామచంద్రపురం, బాలాంతరం, కొయ్యేరు, కోలంక, కాపుల పాలెం, అమలాపురం వెళ్లే ప్రయాణికులకు ఇదే ప్రధానమైన మెయిన్ రోడ్డు కావడంతో నిత్యం ఈ మెయిన్ రోడ్డు రద్దీగా ఉంటుంది. దీనిపై ఆర్ అండ్ బి అధికారులు స్పందించి ఈ రోడ్డుకు వెంటనే మరమ్మతులు నిర్వహించి ప్రమాదాలు నివారించాలని పరిసర ప్రాంతాల ప్రజలు ప్రయాణికులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఎర్ర పోతవరం వద్ద కాలువ వైపు కుంగిన ద్రాక్షారామ-యానాం మెయిన్ రోడ్డు